# హృదయ వజ్రం

వీధిగుమ్మం మెట్లెక్కుతూనే సింహద్వారం తలుపులు దబదబ బాదుతూ–

''వెంకటలక్ష్మీ''

అని అరిచాడు నరసింహారావు.

అంతకు రెండు, మూడు క్షణాల క్రితమే వంటిల్లంతా బాగుచేసుకుని, నడుంవాల్చిన వెంకటలక్ష్మికి–మాగన్ను పడ్డదేమో–ఉలిక్కిపడి లేచింది.

లేస్తూనే, పైట సరిజేసుకుంటూ, బొట్టు ముఖంమీద ఉన్నదోలేదో అద్దంలో చూసుకుని, తృప్తిగా పడకగది గడప దాటి, "వస్తున్నా" అంది.

తలుపుమీద జరిగే చప్పుడుయుద్ధ ధ్వనిముందు వెంకటలక్ష్మి కంఠస్వరం ఓడిపోయింది. తలుపుల చప్పుడు సాగుతూనే ఉంది.

గబగబ అడుగులు వేస్తూ వెళ్ళి గడియ తీసి పక్కగా నిలబడింది.

రెండు తలుపులూ ధనాల్మని గోడలకు కొట్టుకుంటూ విడడమూ, నరసింహారావు లోపల అడుగు పెట్టడమూ ఒక్కమారే జరిగాయి.

గజగజ వణికిపోతూ వెంకటలక్ష్మి తలుపులు దగ్గరగావేసి గడియపెట్టి లోపలకు వచ్చింది.

నరసింహారావు పడకగది గుమ్మంలో జోడు విడిచి, బట్టలువిప్పి ఓ మూలకు విసిరి, లుంగీ చుట్టబెట్టుకుని, మూలకు విసిరిన పాంటు జేబులో కవరుతీసి చేత్తో పట్టుకుని, సిగరెట్ ముట్టించి, దొడ్డి వసారాలోకి నడిచి, గాదె నానుకునిఉన్న మడత మంచం వాల్చి దానిమీద నడుం వాల్చాడు.

సుడిగాలిలో గిర్రున తిరుగుతూ ఎగిరే ఆకులావున్న మనస్సును చిక్కబట్టుకోడానికి యత్నిస్తూ వెంకటలక్ష్మి అతని దగ్గరగా నిలబడి, మంచినీళ్ళగ్లాసు అందిచ్చింది.

హేమంత తుషారబిందు సందోహాచ్ఛాదిత ప్రసూనదళాలలా ఆమె పెదవులు కంపిస్తున్నాయి.

''వంట్లో కులాసాగా ఉంటున్నదా'' అంటూ, కొంగుతో అతని నుదురు తుడిచింది. నవ్వాడు నరసింహారావు.

'ఉషశ్రీ'



వెన్నెల్లో మల్లి మొగ్గలు విరిసినట్లు నవ్వాడు నరసింహారావు.

నవ్వడానికి ప్రయత్నంకూడా చెయ్యలేకపోయింది వెంకటలక్ష్మి.

నరసింహారావు మంచినీళ్ళ గ్లాసు ఖాళీచేసి, నవ్వుతూనే ఆమె బుగ్గమీద చిటుకవేసి, ఆమె కన్నుల్లోకి చూస్తూ, ముక్కు నలిపాడు.

"ఇంకో గ్లాసుడు తెస్తా" అని, కదల బోయిన వెంకటలక్ష్మిని చెయ్యిపుచ్చుకుని ఆపి, మంచం మీద కూర్చోబెట్టి దగ్గరగా హత్తుకుని బుగ్గలపై కెంపులే కురిపించాడు

అయోమయ స్థితిలో వెంకటలక్ష్మి అయిదారు క్షణాలు అలానే ఉండిపోయింది

ఆమెను ఒళ్ళోకి తీసుకుని ముంగురులు నిమిరాడు

ఈ మారు ఆమె చేతులు అతనిచుట్టూ తిరగకుండా ఉండలేకపోయాయి.

ఇటువంటి మధుర క్షణాలే లేకపోతే.. ఆమె సంతోషసాగరంలో తేలిపోతున్నది.

నెమ్మదిగా ఆమెను మంచంమీదికిదింపి..

"పిచ్చితల్లీ..." అని నవ్వాడు.

"స్నానం చేస్తారా" అంది, మంచం దిగుతూ.

నవ్వాడు నరసింహారావు.

ఆ నవ్వుతో శ్రుతిగలపలేక పోయింది వెంకటలక్ష్మి.

"ఏం... చెమట వాసనగా ఉందా" అంటూ మంచందిగి ఆమెను గుండెలకు హత్తుకుని, వీపు నిమురుతూ రెండు క్షణాలు నిలబెట్టాడు.

నెమ్మదిగా ఆమెను మల్లిపందిరి వరకు నడిపించి, "ఈ నరరూప సింహంతో అయిదేళ్ళనుంచి కాపురం చేస్తూ యిద్దరు పిల్లల్ని కన్న లేడివి నువ్వు.. లక్ష్మి"అని చుబుకం పైకెత్తుతూ తనవైపు తిప్పుకున్నాడు.

ఆమె మాట్లాడలేదు.

అలే చూస్తున్నది.

"ఈ రాక్షసుడితో నానా యాతనలూ.." అని యింకా అతను యేదో అనబోతుండగానే.

"నేనెప్పుడూ అలా అనుకోవటం లేదు" అని వంగి అతని పాదాలకు నమస్కరిస్తుండగా, ఆమె కన్నులనుండి రెండే రెండు బాష్పబిందువులు వాటిమీద

రాలి, అతని శరీర సర్వస్వానికి విద్యుద్ఘాతం తగిలినంత బాధ కలిగించాయి.

అతను అమాంతం ఆమె రెక్కలు పుచ్చుకు లేవదీసి, గుండెలకు హత్తుకుంటూ—

"నువ్వు అనుకోకపోయినా నా ర్థాక్ష సత్యం నాకు తెలుసు..." అని కన్నులు ఒత్తుకుని—

"కాని—అదంతా నీవంటి అమాయకురాలిమీదనే ప్రయోగిస్తున్నందుకు యేడుస్తున్నాను" అంటూ తలమొత్తుకుని మంచంమీద కూర్చున్నాడు.

ఉక్కిరిబిక్కిరయింది వెంకటలక్ష్మి.

గొంతు గురగుర లాడింది.

గుండ్రని నీలాల కనులలో ఆర్ద్రిత ద్రవిస్తున్నది.

## 2

నరసింహారావు తాత నరసింహంగారు కరిణీకం సాగించే రోజులలో కట్టించారు ఈ మండువాలోగిలి. ఆ రోజులలో ఈ లోగిలిని గురించి చాలా ఘనంగా చెప్పుకునేవారు. అప్పట్లోనే యిది కట్టడానికి యేడెనిమిది వేలదాకా అయి ఉంటుందని అభిజ్ఞుల అంచనా. గడిన్నర క్వార్టర్సులో కాపురాలకు అలవాటు పడ్డవారికి ఆ లోగిలిని గురించి యెంత చెప్పినా ప్రయోజనంలేదు.

గృహప్రవేశానికి విచ్చేసిన బ్రాహ్మణ్యం యావత్తూ ఆ మండువా లోగిలిలో ఒక్కసారిగా భోజనాలకు లేచారట. అంటే సుమారుగా అయిదారు వందలమంది యేకకాలంలో భోజనం చెయ్యడానికి వీలయినంత వైశాల్యంగల మండువా లోగిలిలో వెంకటలక్ష్మి కాపురం చేస్తున్నది.

అయితే—

వెంకటలక్ష్మి కాపురం చేస్తున్నదా—అని నిలదీసి అడిగితే మాత్రం—ఆ మండువాయింట్లో ఆమె బ్రతుకుతున్నదనడమే న్యాయమైనమాట, మొదటి రెండేళ్ళు—కాపురానికొచ్చిన కొత్తలో—వెంకటలక్ష్మికి తోడుకూడా లేదు.

మూడోఏడు ప్రవేశిస్తుండగా పెద్ద కూతురు పుట్టింది. పెద్దదాని పురిటికి చచ్చిబ్రతికిన వెంకటలక్ష్మికి జీవితంమీద ఆశ మళ్ళీ చిగురించింది. ఆ అనారోగ్య దశలో నరసింహారావు చేసిన సేవ, చూపిన అనురాగం వెంకటలక్ష్మికి సంపూర్ణారోగ్యం సమకూర్చాయి. పెళ్ళి కూతురు ముఖమే అయింది బాలింత వెంకటలక్ష్మి ముఖం.

ఆసుపత్రినుంచి యింటికివచ్చిన నాలుగోనాడు మొదలు నరసింహారావు మళ్ళీ మామూలువాడే అయాడు.

## 3

పెద్దపిల్ల చిట్టికి యెనిమిదోనెల!

ఆ రోజుల్లో—భర్తతో కలిసి పెద్దాడ

పడుచు కూతురు పెళ్ళికి వెళ్ళింది వెంకటలక్ష్మి.

ఇంతాచేస్తే... వెధవది... ట్రంకుపెట్టి తాళంకోసం...

పెళ్ళివారంతా తీరిగ్గా కూర్చుని పెళ్ళికొడుకునిగురించీ, మగ పెళ్ళివారి తాలూకు ఆడంగుల రాజసాలనుగురించీ యెవరికి తోచినట్లు వారు విసురులు విసురుతూ కాలక్షేపం చేస్తున్నారు. ఆడంగుల్లో జమ అయిన పెద్ద బావగార్లు ఏవో అని నవ్వులపాలవుతూ ఉన్నారు.

ఉండగా — వచ్చాడు నరసింహారావు.

నరసింహారావు వస్తూనే, "పెట్టి తాళం" అని గర్జించాడు.

వెంకటలక్ష్మి రెండుపాదాలూ యెదురెదురుగా ఉంచి, మధ్యలో అద్దం ఉంచుకొని, పాపిడి తీసిన దువ్వెన ముని పళ్ళతో పట్టుకుని జడ అల్లుకుంటూన్నది.

అల్లుకుంటూ, అల్లుకుంటూన్నది అద్దం అలానే వదిలేసి, నోట్లో దువ్వెన జూర్చేసి, గజగజలాడుతూ మంగళ సూత్రాల తాడు పైకితీసి గిరగిర తిప్పి చూసింది.

తాళంచెవి లేదు.

కూర్చున్నచోట కలయ జూసింది.

పెట్టిదగ్గరకుపోయి వెనకా, ముందూ చూసింది.

తాళంకప్ప లాగి చూసింది.

తాళంవేసే ఉంది — చెవి కనిపించ లేదు.

రాత్రి పన్నెండింటికి వచ్చి పేకాటకు డబ్బు తీసుకుని తాళం ఆయనే పట్టుకు వెళ్ళిన విషయం స్మృతికి వచ్చేసరికి, ఆమె ముఖం 'వసంత సంధ్యలో మల్లి మొగ్గలా వికసించింది.

.వస్తూన్న వెంకటలక్ష్మి ముఖంలో నవ్వుకంటె, చేతులోతాళం లేకపోవటంతో అతనికోపం తారామండలానికి యెగిసింది.

ఒక్క అంగలో ఆమెను సమీపించి, జుట్టుపట్టుకుని, "కనిపించలేదుగా...ఎంత నిర్లక్ష్యం...ఉంచుకున్న దానికీ, కట్టుకున్న పెళ్ళానికీ యేమిటి తేడా" అని అలానే కాలు ఎత్తేడు తన్నటానికి.

నిస్సహాయస్థితిలో ఉన్న వెంకటలక్ష్మిమీద జరిగే ఈ హింసాకాండను అందరూ చూస్తూ ఊరుకోగలిగారంతే. అంతే అయేదేకాని, ఆ సమయానికే నరసింహారావుకోసం వచ్చిన రంగారావు ఒక్క దూకులో వెళ్ళి జెబ్బపట్టుకులాగి వెనక్కి నెట్టేసి, వీధిలోకి నడిపించుకు పోయాడు.

* * *

సాయంకాలం చల్లగాలి తిరిగాక, పెళ్ళి పందిరిలోకి వచ్చిన నరసింహారావు వెంకటలక్ష్మిని వెతికి, వెతికి పట్టుకుని, "లక్ష్మి, నేను పశువుని. ఆ క్షణానికి పరమేశ్వరుడు అనుగ్రహించి రంగారావును పంపాడు, కానీ... లేకపోతే

నువ్వు నాకు దక్కేదానివా...'' అని వలవల యేడ్చాడు.

అతనికంట నీరు చూసేసరికి వెంకట లక్ష్మి గుండె నీరయిపోయింది.

*　　*　　*

ఇంకోసారి.

అప్పటికి మల్లిని కడుపుతోఉంది.

ఆరోనెల వెళ్ళి యేడోనెల ప్రవేశించింది.

ఆరోజు రాత్రికి వస్తానని కబురంపిన భర్తకోసం రాత్రి పదీ—పదకొండుదాకా భోజనం చెయ్యకుండా కనిపెట్టుకు కూర్చుని, యెంతకూ రాకపోతే, చెవులూ—చూపులూ వీధివైపే ఉంచి రెండు మెతుకులు నోట్లో వేసుకుని, నీరసంగా, మంచంమీద చిట్టిపక్కనే చెంగు తలకింద ఉంచుకు పడుకుంది. నడుం వాలుస్తుండగానే నిద్ర ముంచు కొచ్చింది.

కోడికూతకు మెలకువవచ్చి, తలుపు తీసి, వీధిలోకి వచ్చేసరికి, ఆమె గుండె ఝల్లుమన్నది. చేతులో చీపురు గుమ్మం మెట్లమీదనే వదిలేసి, మంగళసూత్రాలు కళ్ళకద్దుకుని, అరుగుమీద ముడిచిపెట్టుకు నిద్రపోతున్న భర్తను లేపి లోపలకు నడిపించింది.

నరసింహారావు నిద్రమత్తుతో తూలు తూనే నడిచి పందిరిమంచం యెక్కి పడుకున్నాడు.

బెదురుగుండెతో—




వణికే కంఠంతో—

తడి కన్నులతో—

వెంకటలక్ష్మి చెప్పిన క్షమాపణలేవీ అతనికి వినిపించలేదు. వినేస్థితిలో అతను లేడని తెలిసినా ఆమె చెపుతూనే ఉన్నది. మంచమెక్కుతూనే గుర్రు ప్రారం భించాడు.

నరసింహారావు నిద్ర లేచేసరికి వెంకటలక్ష్మి పనులన్నీ పూర్తి చేసుకుని, చిట్టికి తలంటిపోసి, ఉంగరాల జుత్తు రిబ్బన్‌తోకట్టి, మూడు నెలలక్రితం అతను బొంబాయినుంచి తెచ్చిన చేతులు

లేని గౌను తొడిగి కూర్చోబెట్టి, తను కంఠంస్నానంచేసి, కుంపటిమీద కాఫీకి నీళ్ళుపడేసి దేవీ పీ ఠ ం ముం దు దీపం వెలిగించి, మంగళసూత్రాలు మరోమారు కళ్ళకద్దుకుని, పైటచెంగులో భద్రంగా ఉంచుకుని, పడకగదివైపు వచ్చింది.

నరసింహారావు దొడ్డి వసారాలోకి వచ్చాడు. వెంకటలక్ష్మి తెచ్చియిచ్చిన బ్రష్ అందించింది, చిట్టి.

చిట్టిని చూచేసరికి నరసింహారావు పితృహృదయ ద్వారాలు తెర్చుకున్నాయి. అమాంతం ఆమెను ఎత్తుకుని గుండెలకు హత్తుకుని, ఆమెతల బుజంమీద ఆన్చుకుని బుగ్గలు నిమిరాడు.

"చిట్టీ, ఈ వేళ నేనెందుకొచ్చానో తెలుసా...నీ పుట్టినరోజుకనక. ఒసే.. లక్ష్మి...ఈవేళ దీని పుట్టినరోజుకదా. ఏం చేస్తున్నావే" అన్నాడు, వంటింట్లో ఉన్న లక్ష్మిని సమీపించి.

"మీరు రావడంకంటె దానికీ, నాకూ ఏం కావాలి ? అదేచాలు" అంది వెంకటలక్ష్మి, సంతోషముతో అతని ప్రక్కగా నిలబడి.

"సరేలే కాని... యేం చేస్తున్నావో చెప్పవే" అన్నాడు, లాలనగా.

"మీరేం చెయ్యమంటే అదే చేస్తాను. అది మీకోసం ఈమధ్య రోజూ కలవరిస్తూనే ఉంది"

అంటున్నప్పుడు దుఃఖం పొంగి పొర్లింది.

"కాని ... లక్ష్మి! మీనాన్న నిన్ను నాకిచ్చి పెళ్ళిచేసి నీగొంతు కోశాడే"

అంటూ, ఆమె ముంగురులు నిమిరాడు

లక్ష్మి తలవంచుకుంది.

"నీ కెప్పుడూ నన్ను వదిలేసి లేచిపోవాలని ఉండదు టే?" అని, ఆమె ముఖంలోకి చూశాడు.

"ఏమిటా మాటలు. నిజంగా నాకన్న అదృష్టవంతు లెవరు?...మీరు ముఖం కడిగెయ్యండి కాఫీ తయారవుతున్నది" అంది.

నరసింహారావు కాలకృత్యాలు ముగించి బజారు వెళ్ళి గంటలో తిరిగి వచ్చాడు. మునసబుగారి పాలేరు సామానుగంప తెచ్చి వాకిట్లో ఉంచాడు.

'లక్ష్మి...లక్ష్మి...చూడవే...ఎంత గాలించినా ఈ అయిదు చీరలే నచ్చాయి నాకు. ఈసారి బొంబాయినుంచి యింకా మంచివి తెస్తాలే. చిట్టికి ఆరు గౌనులూ, ఆరు లాగులూ కుట్టి తెమ్మన్నాను. ముందు రెండుజతలు మస్తాన్ సాహెబు తెస్తాడు. ఇదిగో, ఈ సాయంత్రం వీధి పిల్లలందరినీ పిలిచి మైసూరుపాకు పంచిపెట్టు.' అంటూ తను కూడా సేలం కండువా చుట్టుబెట్టుకుని వంటలోకి దిగాడు.

పదకొండు కాకుండానే వంట పూర్తి అయింది. ఇరుగు, పొరుగు పిల్లలిద్దరు ముగ్గుర్ని పిలుచుకొచ్చి చిట్టితో కూర్చో బెట్టి హాయిగా కబుర్లుచెపుతూ భోజనాలు చేయించేశేడు. వెంకటలక్ష్మి ఆ ఘడియలో శోభనంనాటి ఆనందం కంటె అధిక సంతోషం పొందింది.

చిన్నపిల్లలతో చిట్టి ఆడుకుంటుండగా భార్యా–భర్త లిద్దరూకూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ పెళ్ళినాటి వెండి కంచంలో భోంచేస్తున్నారు. వెంకటలక్ష్మి అన్నం కలుపుతుంటే నరసింహారావు ముద్దలుచేసి ఆమె నోటికికూడా అందిస్తూ వివిధ ప్రాంతాలలోని భోజనాల వివరాలు చెపుతున్నాడు మధ్య, మధ్య యేవో వేళాకోళాలు చేస్తూనే ఉన్నాడు.

సరసాలాడుతూ, ఆడుతున్నవాడు చారుతో నిండిన కంచం వెంకటలక్ష్మి నెత్తిమీద బోర్లించేసి,

"ఛీ...పాడుముండా !... చారులో ఉప్పు ఎంతతగలెయ్యాలో తెలీనితెర్ర... నీతో నాకు కాపురమా ?" అని అరుస్తూనే లేచేసి, చేతులు కడుక్కుని బట్టలు మార్చుకు వెళ్ళిపోయాడు.

## 5

ఇటువంటి సన్నివేశాలెన్నో రుచి చూసింది వెంకటలక్ష్మి. అతని ఆగ్రహాను గ్రహాలకు అలవాటు పడిపోయిన వెంకట లక్ష్మి నేడు కూడా అటువంటి సంఘటన జరుగుతుందని భయపడక పోయినా, జరుగుతేమాత్రం యెదుర్కొనే స్థితిలో లేదు. ఎదురుకోవడ మనేదేలేదు.

అతని హృదయావేశపు తీక్షణతతో పాటు, నవనీతకోమల సౌకుమార్యాన్ని కూడా ఆమె అనుభవించింది. రెండు ధృవాలూ సమఉజ్జీలోనే ఉంటాయని ఆమెకు తెలుసు.

కాపరానికొచ్చింది లగాయతు వెంకట లక్ష్మికి పుట్టింటికి పోయే అవకాశమే లభించలేదు. అయిదోయేటనే తల్లి పోవడమూ, తన పెళ్ళికి యేణ్ణర్థం ముందుగా సవతితల్లి కాపురానికి రావడమూ..ఆమెకు ఆయింటి వైపువచ్చే అవకాశాన్ని రద్దుచేశాయి. ఈ అయిదేళ్ల నుంచీ ఆమెకు నరసింహారావే సర్వస్వ మూను.

"లక్ష్మి...నీకు తెలుసా...నీ మొగు డొకపిల్ల జమీందారనీ, ఆ లక్షణాలన్నీ సంపూర్ణంగా కలవాడనీ..."

అన్నాడు, సిగరెట్ పీలుస్తూ.

"తిరిగి, తిరిగి వచ్చారు. రెండు చేదలు తోడియిస్తాను స్నానం చేసే య్యండి. భోంచేద్దురుగాని" అని లేవ బోయింది.

ఆమె నడుంమీంచి చెయ్యి పోనిచ్చి పట్టుకుని,

"కాదు లక్ష్మి...నే చెప్పేది శ్రద్ధగా విను. నేనొక పరమరాక్షసుణ్ణి. ఈ ప్రపంచంలో భయమనేది యెలా ఉంటుందో

యెరగను. పదహారో ఏట దేశాటనం ప్రారంభించాను. ఆ మూలనుంచి ఈ మూలవరకూ ఇప్పటికి ముమ్మారు తిరిగి ఉంటాను. అయితే నా జీవితంలో ఎవరినీ, ఎప్పుడూ తెలిసి బాధించలేదు. పెంచిన అమ్మమ్మ బాధపడి ఉంటుంది. కట్టుకున్న నిన్ను హింసిస్తున్నాను. నువ్వు నావల్ల పడే హింస తలుచుకున్నప్పుడల్లా నాకు నువ్వో దేవతలా కనిపించి, నా గుండె బ్రద్దలై పోతూ ఉంటుంది...''

మాట్లాడుతూన్న నరసింహారావు గొంతు గద్గదమైంది. గుండె ఉండలు చుట్టుకు పోతున్నది. అతి కష్టం మీద దుఃఖాన్ని ఆపుకుని, చేత్తో తెచ్చిన కవరు ఆమె కందిస్తూ,

"ఇవిగో, ఈ కాగితాలు తీసుకో. ఇవి మా అమ్మ ఆస్తికి సంబంధించినవి. ఇంతవరకూ ఈ ఆస్తి నేను అమ్మకుండా ఉంచగలిగాను. ఇది నువ్వూ, పిల్లలూ అనుభవించాలి. అరవై యెకరాల ఆస్తి తాతగారు నా చేతుల్లో పెట్టిపోతే ఈ ఆరెకరాలూ మిగిలాయి. ఈ కాగితాలు నీ పెట్టిలో ఉంచుకో. ఎటువంటి సమయములో అయినా సరే అవి నాకివ్వకు. ఎంత హింసించినా నాకు చిక్కనివ్వకు సుమీ. నిన్ను పెళ్ళాడి నేను సుఖ పెట్టిందిలేదు. నీ పిల్లల్ని కూడా నాశనం చెయ్యనా? నేను యే క్షణంలో 'హరీ' అంటానో తెలీదు...''

అంటుండగా, అతని నోటికడ్డంగా చెయ్యి ఉంచి,

"ఏమిటా మాటలూ మీరూనూ. మీరు లేకపోతే నేను..." అని కన్నులు ఒత్తుకుంటూ గుండెమీద తల ఆన్చింది.

''నే చెప్పేది పూర్తిగా విను. నా గురించి ఎరగని వాళ్ళు నేను పది, పదిహేను వేలయినా అప్పుచేసి ఉంటానంటారు. కాని నా జీవితంలో అర్ధణా అప్పుచెయ్యలేదు. అది మరువకు. అప్పు చెయ్యడం యిష్టంలేకనే వేలు ఖరీదు చేసే ఆస్తి వందలకు అమ్మేశాను. అది సరే. ఇవి ముందు పెట్టెలో ఉంచు. నా జీవితం యెక్కడ తెల్లవారుతుందో..." అంటూండగా వెంకటలక్ష్మి అతని పెదవులు మూసేసింది.

"పిచ్చిదానా...నీకేం భయంలేదే... భగవంతుడు నాలాంటి పాపులకు ఆయుర్దాయం యెక్కువిస్తాడే" అని గుండెలకు దగ్గరగా హత్తుకున్నాడు.

వెంకటలక్ష్మి హృదయంలో లక్ష మల్లెలు విరిశాయి.

ఆమె మోములో వేయి గులాబులు వికసించాయి.